
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు

5

ఆదివారం 8 జూన్ 2025



నిర్లక్ష్యం నీడలో..చరిత్ర సాక్ష్యం

- ముళ్ల పొదల్లో భోగరాణి బావి
- నవాబుల పాలనలో నిర్మాణం
- ఆదరణకు నోచుకోని అందమైన కట్టడం

6

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ

- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు



బక్రీదు ప్రార్థనల్లో పాల్గొన్న పెద్దదర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని, టీడీపీ నేత అమీర్‌బాబు తదితరులు

కడప కల్చరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ఈద్గాలకు, మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు (నమాజు) నిర్వహించారు. ఆప్యాయంగా ఒకిరినొకరు ఆలింగనం చేసుకుని సోదరభావం వ్యక్తపరచి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కడప నగరంలోని ఆలంఖాన్‌పల్లె వద్ద దండు సమీపంలో ఉన్న మురాదియ షాహి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గా వారసుడు ముతవల్లి సయ్యద్‌షా మొహమ్మద్ జమాలుల్లా భాషా సాహెబ్ దైవ సందేశం గావించారు. బిల్టప్ సమీప ఈద్గా వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొని నమాజ్ చేశారు. ఇందులో పెద్దదర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని, మతగురువు న్యామతుల్లా పండుగ సందేశాన్ని ఇచ్చారు. ముఖ్యంగా బక్రీద్ త్యాగాలకు ప్రతీక అని, అల్లాహ్ ఆజ్ఞను పాటించాలని అన్నారు. ప్రతీ ఒక్కరూ సోదర భావంతో మెలగాలన్నారు.

రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రవాణాశాఖ కార్యాలయం సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి

సీకేదిన్నె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఉపరవాణా శాఖ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు ప్రజలకు ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కలిగించాలన్నారు. వేగంకంటే ప్రాణం ఎంతో విలువైందని, రోడ్డు ప్రమాదాల వలన ఏ ఒక్కరు ప్రాణాలు కోల్పోకూడదని దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు భద్రత కమిటీలో ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి ప్రమాదాలను పూర్తిగా అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను మంత్రి పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పసుపులేటి విజయభాస్కర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- డీసీసీబీ, డీసీఎంఎస్‌ల ద్వారా పారదర్శక సేవలు
- వైసీపీ పాలనలో రైతులపేరిట బినామీలకు రుణాలు
- కష్టపడేవారందరికి పదవులు
- డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారోత్సంలో కూటమి నేతలు



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, చిత్రంలో రితేశ్‌రెడ్డి, రామగోపాల్‌రెడ్డి, ఆర్.మాధవి, విజయమ్మ, వరదరాజులరెడ్డి, బీటెక్ రవి, ముక్కారూపానందరెడ్డి, హరిప్రసాద్, సాయిలోకేశ్, వెంకటసుబ్బారెడ్డి తదితరులు

కడప రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు పేర్కొన్నారు. శనివారం కడప నగరం ఊటుకూరులోని ఓ కన్వెన్షన్ హాలులో డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ముందుగా డీసీసీబీ చైర్మన్‌గా మంచూరు సూర్యానారాయణ రెడ్డి అనంతరం డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎర్రగుండ్ల జయప్రకాశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. టీడీపీని జిల్లాలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందేకు కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. పార్టీకోసం కష్టపడే వారికి పదవులు వస్తాయనడానికి సూర్యనారాయణరెడ్డి, జయప్రకాశ్‌లే నిదర్శనమన్నారు. మరో ఆరు నెలల్లో డీసీసీబీ, డీసీఎంఎస్ ఎన్నికలు రాబోతున్నాయని వీటిలో ఘనవిజయం సాధించేలా ముందుకు సాగాలన్నారు.

కడప, అన్నమయ్య జిల్లాల బీజేపీ అధ్యక్షులు సాయిలోకేశ్, వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం నుంచి సమకూరాల్సిన అన్ని సదుపాయాలు సకాలంలో వచ్చేలా కృషిచేస్తామన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ డీసీసీబీ, డీసీఎంఎస్‌లు అవినీతికి తావులేకుండా రైతులకు విరివిగా రుణాలతో పాటు యంత్రపరికరాలను నాణ్యమైన ఎరువులను, విత్తనాలను సకాలంలో అందించాలన్నారు. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ జిల్లాలో మహానాడు నిర్వహణతో వైసీపీ ఆందోళన చెందుతోందన్నారు. కడప నియోజకవర్గంలో కష్టపడే ప్రతి టీడీపీ కార్యకర్తకు పదవులు తప్పకుండా వస్తాయన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు.

డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి వీరారెడ్డి నాయకత్వంలో ఒక కార్యకర్తగా తన రాజకీయ జీవితం ప్రారంభమైందన్నారు. చైర్మన్‌గా తాను పారదర్శక సేవలు అందిస్తానన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్ మాట్లాడుతూ సేవలన్నింటిని పారదర్శకంగా కొనసాగిస్తామన్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ, పాడి పరిశ్రమల అభివృద్ధికి డీసీసీబీ, డీసీఎంఎస్‌ల ద్వారా మెండుగా చర్యలు చేపట్టాలన్నారు.



డీసీసీబీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న మంచూరు సూర్యనారాయణరెడ్డి



డీసీఎంఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎర్రగుండ్ల జయప్రకాశ్

ప్రస్తుతం డీసీసీ బ్యాంకులో రూ.3వేల కోట్ల టర్నోవర్ ఉందని దీనిని మరింతగా పెంచాలన్నారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జమ్మలమడుగు, బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు భూపేశ్‌రెడ్డి, రితీశ్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో డీసీసీబీ రుణాల్లో అంతులేని అవినీతి జరిగిందన్నారు. వాటన్నింటిని వెలికితీస్తామన్నారు. కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, టీడీపీ నేత ఉక్కు ప్రవీణ్, హరిప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీఈవో సురేశ్, డీసీసీ బ్యాంకు సీఈవో రాజామణి, డీసీఎంఎస్ జిల్లా అధికారి ఖాదర్‌బాషా, పలువురు టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో 62శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. శనివారం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ (బీఐఈఏపీ) ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. ఈ పరీక్షలు మే 12 నుంచి మే 20 వరకు జరిగాయి. ఈ పరీక్షలకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3,836 మంది హాజరుకాగా 2,384 మంది ఉత్తీర్ణత సాధించారు. 1452 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. జిల్లాకు రాష్ట్రస్థాయిలో 15వ స్థానం లభించింది. ప్రథమ సంవత్సరం విద్యార్థులు సంబంధించి జిల్లా నుంచి 5,315 మంది పరీక్షకు హాజరుకాగా 2,266 మంది ఉత్తీర్ణత సాధించారు. 3,049 మంది ఫెయిల్ అయ్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా 15వ స్థానం లభించింది.

11న పాత్రికేయులకు యోగా శిక్షణ : కలెక్టర్



కడప కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కడపలోని రాజీవ్ మార్గ్‌లో 11వ తేదీ బుధవారం నిర్వహించే యోగా శిక్షణ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, డెస్క్ జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా మే 21 వ తేదీ నుంచి నెల రోజుల పాటు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేకించి జర్నలిస్టులకు 11 వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 8గంటల వరకు యోగా శిక్షణ ఏర్పాటు చేశామని వివరించారు. అంతర్జాతీయ యోగా మాసోత్సవ వేడుకల్లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సూర్యనారాయణరెడ్డికి అభినందనల వెల్లువ

బద్వేలుటౌన్ జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసి జిల్లా కేంద్ర సహకార బ్యాంకును అభివృద్ధిబాటలో పయనింపచేస్తానని శనివారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన డీసీసీ బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం సూర్యనారాయణరెడ్డిని రైల్వే క్లాస్ ఒన్ కాంట్రాక్టర్ అరవ శ్రీనివాసులరెడ్డి, ధాత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ తేజేశ్వరరెడ్డి, మేనేజింగ్ పార్టనర్ మన్య రాజశేఖర్‌రెడ్డి, పల్లె రమేశ్‌రెడ్డి, కత్తిరిపల్లె నాగార్జునరెడ్డి, అరవ వెంకటసుబ్బారెడ్డి, పి.రెడ్డెయ్య, వంగల నాగిరెడ్డి, వంగల సూర్యనారాయణరెడ్డి, ఎన్ఆర్ఐ పాలకొండు రాజశేఖర్, మాచుపల్లె వెంకట క్రిష్ణారెడ్డి, మాచుపల్లె లక్ష్మిదేవి, పల్లె సుబ్బారెడ్డి తదితరులు గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.



డీసీసీ బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణరెడ్డికి అభినందనలు తెలుపుతున్న రైల్వేకాంట్రాక్టర్ అరవ శ్రీనివాసులరెడ్డి, అరవ వెంకటసుబ్బారెడ్డి



సూర్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నేత, ఏసియన్ డిజిటల్ కేబుల్ చైర్మన్ రాగిమాను ప్రతాప్‌కుమార్

రైతులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలి

డీసీసీ బ్యాంకు ద్వారా రుణాలు మంజూరుచేసి రైతుల అభివృద్ధికి తోడ్పడాలని సూర్యనారాయణరెడ్డిని టీడీపీ నేత, ఏసియన్ డిజిటల్ కేబుల్ చైర్మన్ రాగిమాను ప్రతాప్‌కుమార్ కోరారు. అనంతరం సూర్యనారాయణరెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపారు.

టీడీపీకి సుగవాసి బాలసుబ్రమణ్యం రాజీనామా



- చంద్రబాబుకు లేఖ

6

బకాయిలు భరించలేం..

- అద్దెలు చెల్లించండి..
- సచివాలయ భవన యజమానుల వేడుకోలు

6

తీరనున్న దారి సమస్య

- పెన్నానదిపై రూ.62 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం
- చకచక సాగుతున్న పనులు

కొండాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకేపల్లె గ్రామం వద్ద పెన్నానదిపై రూ.62 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జితో పది గ్రామాల కష్టాలు తీరనున్నాయి. కొండాపురం మండలంలోని సంకేపల్లె, శిరిగేపల్లె, చామలూరు, ఎర్రగుడి, టి.కోడూరు, మురగంపల్లె, కొత్తపల్లె, రాగికుంట, దొబ్బుడుపల్లె, తిరుమలాయపల్లె గ్రామాల ప్రజలు పెన్నానది మీదుగా రాకపోకలు సాగిస్తారు. గండికోట ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉన్నప్పుడు పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆ సమయంలో మండల కేంద్రమైన కొండాపురం రావాలంటే సుమారు 70 కిలోమీటర్లు చుట్టు తిరిగి అనంతపురం జిల్లా మీదుగా రావాల్సి వస్తోంది. దీంతో బ్యాక్‌వాటర్ ఉన్నప్పుడు ఈ గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ప్రజల ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం పెన్నానదిపై రాకపోకలను సాగించడానికి బ్రిడ్జిని మంజూరు చేసింది.



పెన్నానదిపై ప్రస్తుతం పదిగ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే దారి ఇదే



బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

పది గ్రామాల ప్రజల హర్షం

2019వ సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చొరవతో రూ.34 కోట్లతో పది గ్రామాల ప్రజలకు మేలు జరిగేవిధంగా బ్రిడ్జి పనులు ప్రారంభించారు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఎన్నికలు జరగడం, ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో బ్రిడ్జి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా ఈ బ్రిడ్జి పనులను గాలికి వదిలేసింది. దీంతో ఆరేళ్లుగా ప్రజలు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి గత ఏడాది ఎన్నికలకు ముందు గండికోట ముంపు సమస్యలపై ఈ ప్రాంతంలో పాదయాత్ర చేశారు. ఆ సమయంలో ఇక్కడి పది గ్రామాల ప్రజల సమస్యను గుర్తించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు సారధ్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ.62 కోట్ల నిధులు మంజూరు చేయించారు. మే 23వ తేదీన తిరిగి భూపేశ్‌రెడ్డి పనులు ప్రారంభించడంతో పది గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పనులు చకచక సాగుతున్నాయి. త్వరిత గతిన పనులు పూర్తిచేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న భూపేశ్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

తీరనున్న దారి కష్టాలు

గండికోట ప్రాజెక్టులో బ్యాక్‌వాటర్ ఉన్నప్పుడు పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంటోంది. బ్రిడ్జి పనులు ప్రారంభం కావడంతో చుట్టు పక్కల గ్రామాల్లోని ప్రజల కష్టాలు తీరనున్నాయి.

\- రాఘవేంద్రారెడ్డి, సర్పంచ్, చామలూరు

నీటి గుంతలో పడి తండ్రీకొడుకు మృతి

జమ్మలమడుగు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణం ముద్దనూరు రోడ్డులో శనివారం మధ్యాహ్నం పెన్నానది వంతెన పక్కన నీటి గుంతలో పడి తండ్రి గంగుల మనోహర్ (38), అతని కుమారుడు గంగుల జోయల్ (17) మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. వారు హైదరాబాదులోని బంజారా హిల్స్‌లో నివాసం ఉన్నారు. మూడు రోజుల క్రితం కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ గ్రామంలో బంధువుల వివాహం కోసం కారులో వచ్చారు. అక్కడి నుంచి శుక్రవారం జమ్మలమడుగు బీసీ కాలనీలో నివాసం ఉన్న తన సోదరి ప్రమీలారాణి ఇంటివద్దకు కుమారుడితో కలసి మనోహర్ వచ్చారు. శనివారం ఉదయం తన కొడుకును, చెల్లెలి కూతురిని వెంట పెట్టుకుని మనోహర్ గండికోటకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి 12 గంటల సమయంలో జమ్మలమడుగుకు వస్తూ మార్గమధ్యంలోని పెన్నానది వంతెన వద్ద ఫొటోలు తీసుకోవడానికి ఆగారు. అంతలోనే కాలుజారి మనోహర్ పక్కనే ఉన్న నీటి గుంతలో పడ్డాడు. ఎంతసేపటికి అతను పైకి రాకపోవడంతో కుమారుడు గంగుల జోయల్ నీటి గుంతలో దిగి అతను కూడా మునిగిపోయాడు. అక్కడే ఉన్న బాలిక వెంటనే తన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటన స్థలం వద్దకు చేరుకుని నీటిలో దిగి మృతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 3.30 గంటలకు మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి మృతదేహాలను తరలించారు. పెన్నానది వంతెన పక్కన గుంత సుమారు 15 అడుగులలోతు ఉన్నట్లు గజ ఈతగాళ్లు తెలిపారు. ఈ మేరకు జమ్మలమడుగు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతిచెందిన మనోహర్ ఇంటీరియల్ డిజైనర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని కుమారుడు ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తయింది. మృతదేహాల వద్ద మృతుని బంధువులు, కుటుంబ సభ్యుల భోరున విలపించారు.




పెన్నానది వంతెన పక్కన నీళ్లకుంట వద్ద గుమి కూడిన జనం





మృతిచెందిన గంగుల మనోహర్, గంగుల జోయల్

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నెరవేర్చే క్రమంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వార్డు, గ్రామ సచివాలయాలను పలు ప్రాంతాల్లో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అప్పట్లో కొన్ని సచివాలయాలకు భవనాలు నిర్మించినా, మరికొన్నింటి నిర్మాణాలు వివిధ కారణాలతో అర్ధాంతరంగా ఆగిపోయాయి.




ప్రశాంత్‌నగర్, నీరుగట్టువారి పల్లెలో సచివాలయాలు నిర్వహిస్తున్న అద్దె భవనాలు

బకాయిలు భరించలేం..

- అద్దెలు చెల్లించండి.. మహాప్రభో..!
- సచివాలయ భవన యజమానుల వేడుకోలు
- జిల్లాలో రూ.80 లక్షల మేర బకాయిలు

మదనపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణాలతోపాటు, పట్టణ శివారు పంచాయతీలోని గ్రామాల్లో గ్రామ సచివాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఆయా భవనాలకు సంబంధించిన అద్దెలు ప్రభుత్వం నెలనెలా సక్రమంగా చెల్లించక పోవడంతో భవన యజమా నులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటి వరకూ ఏడు నెలలు పూర్తి కాగా, ఎనిమిదో నెల కూడా ముగు స్తున్నా.. బాడుగ డబ్బులు రాకపోవడంతో కొందరు యజమానులు సచివాలయాలకు తాళం వేయడానికి సిద్ధమవుతున్నారు. రావాల్సిన డబ్బులు వచ్చినప్పుడు తీసుకుంటామని, ఆఫీసులు మాత్రం వెంటనే ఖాళీ చేయండని సచివాలయ ఉద్యోగులను ఆదేశిస్తున్నారు. మరికొందరేమో.. ఇప్పటి వరకూ రావాల్సిన బకాయిలు చెల్లించి టేబుల్, కుర్చీలు సర్దుకోండని సూచిస్తున్నారు. నాలుగేళ్లుగా అద్దెలు పెంచలేదని, అప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఒకే మొత్తాన్ని చెల్లిస్తుండడం కూడా వారి ఆక్రోశం, ఆవేశానికి కారణంగా చెప్పవచ్చు. మున్సిపాలిటీ గదులు అయితే మాత్రం.. మూడేళ్లకో సారి రెన్యువల్ చేయడంతోపాటు 33 శాతం అద్దె పెంచి వసూలు చేస్తున్నారు కదా అని ప్రశ్నిస్తున్నారు. పైగా వ్యాపారులు, ఇతర వర్గాలు తీసుకున్న గదులకు ఏ నెలకు ఆ నెల బాడుగ చెల్లించకుంటే సర్వీస్ చార్జీలతోపాటు, అపరాధ రుసుం వసూలు చేస్తున్నా రని, అది కూడా నెలలో అయిదో తేదీ లోపల చెల్లించకుంటే వడ్డీ వసూలు చేస్తున్నారంటున్నారు. ఇదే విషయాన్ని నిన్నటి మున్సిపల్ సాధారణ సమావేశంలో సభ్యులు ప్రస్తావించారు. ఇలా ఎన్నిరోజులైనా ఎలా ఉంటారని ప్రశ్నించారు. జిల్లాలో మొత్తం 501 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 414, పట్టణ ప్రాంతాల్లో 87 సచివాలయాలుండగా, వీటిలో 82 గ్రామ, వార్డు సచివాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటికి చదరపు గజం రూ.6 నుంచి రూ.10 చొప్పున భవనం విస్తీర్ణాన్ని బట్టి గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేల నుంచి రూ.15వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు బాడుగలు నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మూడు లేదా నాలుగు నెలలకోసారి, అది కూడా ఒక నెల మాత్రం చెల్లించి మిగిలిన మొత్తం బకాయి పెట్టింది. అదే ప్రవేటు వ్యక్తులకు బాడుగకు ఇస్తే.. అడ్వాన్సుతో పాటు ప్రతి నెలా క్రమం తప్పకుండా అద్దె వచ్చేదని యజమానులు వాపోతున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా తీసుకుంటే ఎనిమిది నెలలుగా బాడుగలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.80 లక్షల మేర బకాయి ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో 44 వార్డు సచివాలయాలు ఉండగా, అందులో 23 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నెలకు రూ.3 లక్షల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకూ ఏడు నెలలు పూర్తయి, మరో నెల కూడా ఆ జాబితాలో చేరనుంది. జిల్లా కేంద్రం రాయచోటిలో 25 వార్డు సచివాలయాలు ఉండగా, 22 కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇక్కడ కూడా ఇదే పరిస్థితి. రూ.12లక్షల మేర బకాయిలు ఉన్నట్లు చెబుతున్నారు. రాజంపేట మున్సిపాలిటీలో 13 వార్డు సచివాలయాలు ఉండగా, అందులో ఏడు సచివాలయాలు బాడుగ భవనాల్లో నడుస్తున్నాయి. అలాగే జిల్లాలోని 30 మండలాల్లో మదనపల్లె డివిజన్‌లో ఏడు, రాయచోటి డివిజన్‌లో ఆరు, రాజంపేట డివిజన్‌లో పదిహేను చొప్పున మొత్తం 28 గ్రామ సచివాలయాలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. కాగా, సచివాలయ భవనాల అద్దెలను ఆయా భవనాల యజమానుల పేరున సీఎఫ్‌ఎంఎస్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నామని, ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే, వారివారి ఖాతాలకు జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు.

నిర్లక్ష్యం నీడలో.. చరిత్ర సాక్ష్యం



- ముళ్ల పొదల్లో భోగంరాణి బావి
- ఆదరణకు నోచుకోని అందమైన కట్టడం
- నవాబుల పాలనలో నిర్మాణం
- అభివృద్ధి చేస్తే పర్యాటకానికి ప్రోత్సాహం
- పట్టించుకోని పురావస్తు శాఖ

సిద్దవటం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మట్లిరాజులు, సూర్యవంశ రాజులు పరిపాలించిన సిద్దవటం మండల కేంద్రానికి సమీపంలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లె గ్రామాల మధ్యలో భోగంరాణి బావి అనే కట్టడం ఉంది. అప్పట్లో పాలకులు ఈ కట్టడాన్ని విడిదిగా వినియోగించేవారు. సిద్దవటం కోటను హకీంఖాన్ అనే వ్యక్తి పాలించే కాలంలో ఆయనకు ఒక ఉంపుడుగత్తె ఉండేది. తనకోసం ఒక సుందరమైన భవనాన్ని నిర్మించాలని ఆమె రాజును కోరగా, ఆయన సమ్మతించాడు. ఆమె కోరిక ప్రకారం భవనాన్ని నిర్మించాలంటే ఖర్చు చాలా అవుతుందని అప్పటి వడ్డెరలు హకీంఖాన్‌కు తెలపగా, ఆ మొత్తం ఆమే చెల్లిస్తుందని, పనులు ప్రారంభించమని ఆదేశించాడు. దీంతో ఒక తూముడు బంగారు నాణేలు ఇచ్చే ఒప్పందంపై వారు భవనాలను, బావిని నిర్మించారు. పనులు పూర్తయ్యాక తమకు ఇస్తామని చెప్పిన బంగారు నాణేలు ఇవ్వాలని వడ్డెరలు అడగగా, ఆమె ఒక గొడ్డలి తెచ్చి కట్టె తీసివేసి గొడ్డలికి ఉన్న రంధ్రం నిండుగా బంగారు నాణేలు వేసి తీసుకోమన్నదట. ఇది చాలా అన్యాయమని వడ్డెరలు ఆమెతో గొడవకు దిగినా ఆమె లెక్కచేయలేదట. దీంతో కోపగించిన వడ్డెరలు భవనం మధ్యలో బావిపై నిర్మించిన ఉయ్యాల ఊగుతూ, బావిలో పడి చస్తావని శాపం పెట్టారు. ఆ ప్రకారమే ఆమె ఒకరోజు ఉయ్యాలలో ఊగుతూ, బావిలో పడి మరణించిందట. అప్పటి నుంచి ఆ భవన సముదాయానికి భోగం రాణి బావి అని పేరు వచ్చింది. ఆమె కూడబెట్టిన సొమ్ము అంతా ఒక పెట్టెలో ఉంచి ఆ బావిలోనే దాచినట్లు ప్రచారం ఉంది. అత్యంత సుందరంగా నిర్మించిన ఈ బావి ప్రస్తుతం పూడిపోయింది. భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. కొంతభాగం పైకప్పు ఉన్నా చాలావరకు మొండి గోడలే మిగిలిపోయాయి. ఎంత శిథిలమైనా ఇప్పటికీ చాలా అందంగా కనిపిస్తుందని స్థానికులు చెబుతుంటారు.

ఇప్పటికైనా పాలకులు, పర్యాటక శాఖ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న కట్టడాన్ని పరిరక్షించడంతోపాటు అభివృద్ధి చేసి పర్యాటకులకు అందుబాటు లోకి తేవాలని మండలవాసులు కోరుతున్నారు.

పాలకుల నిర్లక్ష్యం కారణంగా చరిత్రను కళ్ల ముందుంచే ప్రాచీనమైన కట్టడాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయనడానికి సిద్దవటం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న భోగంరాణి బావి నిదర్శనంగా నిలుస్తోంది. శతాబ్దాలుగా ఆదరణ లేకపోవడంతో అతి సుందరమైన ఈ కట్టడం క్రమేణా శిథిలమైపోతోంది

అభివృద్ధి చేయాలి



పురావస్తుశాఖ అధికారులు స్పందించి భోగంరాణి బావిని అభివృద్ధి బాటలోకి తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే, పర్యాటకులను ఆకట్టుకునే అవకాశం ఉంది.

- నాగార్జున, ఎస్.రాజంపేట

పర్యాటకరంగానికి ఊతం



భోగంరాణి బావిని అభివృద్ధి చేసి, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలి. దీంతో పర్యాటక రంగం ఊతం లభించడంతోపాటు, ప్రభుత్వానికి ఎంతో కొంత ఆదాయం కూడా వస్తుంది.

- సహదేవ్, ఎస్.రాజంపేట

నాటుసారా స్వాధీనం



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

వాల్మీకిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరితోపాటు, వారికి సరఫరా చేస్తున్న మరో వ్యక్తి పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో స్థానిక సీఐ లత, ఎస్ఐ సుభాషిణి సిబ్బంది శనివారం వాల్మీకిపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. నాటుసారా విక్రయిస్తున్న గుండ్లూరు గ్రామానికి చెందిన అల్తాఫ్‌బాషా (31), కిరణ్ కుమార్ (28)ను అరెస్టు చేసి వారి నుంచి 14 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసు కున్నారు. వీరికి నాటుసారా సరఫరా చేసిన క్రాంతి అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని ముగ్గురినీ రిమాండుకు తరలించారు.

అతిగా మద్యం తాగి యువకుడు మృతి



మృతి చెందిన యువకుడు

మదనపల్లె టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి ఓ యువకుడు మృతిచెందాడు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని యువకుడు మద్యం తాగి పుంగనూరు రోడ్డు పక్కన ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోని అరుగుపై పడుకున్నాడు. శనివారం తెల్లవారే సరికి అతను అరుగుపై నుంచి కింద పడి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు అతను పాతసామాన్లు ఏరుకుని గుజిరీకి విక్రయించి జీవిస్తుంటాడని గుర్తించారు. మృతుని వివరాలు తెలిస్తే స్థానిక తాలూకా పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ వెంకరటమణ ఒక ప్రకటనలో తెలిపారు.

కారు బోల్తా - ముగ్గురికి గాయాలు



బోల్తాపడిన కారు

సిద్దవటం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కారు బోల్తా పడడంతో ముగ్గురికి గాయా లయ్యాయి. నందలూరుకు చెందిన కొందరు శనివారం ఉదయం అనంతపురం నుంచి వస్తుండగా కడప - చెన్నై జాతీయ రహదారిలోని నిర్మలగిరి కాలనీ సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు టైరు పగిలిపోవడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న దుకాణంలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయా ణిస్తున్న రామకృష్ణయ్య, కల్యాణి, ప్రశాంతి గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ప్రమాద సమయంలో కారులు ఐదుగురు పెద్దలు, నలుగురు పిల్లలు ఉన్నట్టు ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు తెలిపారు. ఈ ప్రమాదంలో పెంచలయ్యకు చెందిన దుకాణం పాక్షికంగా దెబ్బతినింది.

ఆటో బోల్తా.. తొమ్మిది మందికి గాయాలు

మదనపల్లె టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడటంతో తొమ్మిది మంది గాయపడ్డారు. మండలంలోని తురకపల్లెకు చెందిన చంద్రశేఖర్ శనివారం తన షేర్ ఆటోలో మదనపల్లె ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రయాణికులను ఎక్కించుకుని ఆరోగ్యవరం బయలుదేరాడు. మార్గమధ్యంలోని ఎర్రగన్నమిట్ట డౌన్‌లో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే యత్నంలో అదుపు చేయలేకపోవడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చంద్రశేఖర్, షాహీనా (30), హమీదా(35), మస్తాని(40), నాదిర్‌షా(25), యూసఫ్(5), ఆసియా(3), రుఖియా (13), మరియా(12) గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స చేయించుకుని బాధితులు ఇళ్లకు వెళ్లిపోయారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

మదనపల్లె టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. కురబలకోట మండలం తెట్టు పంచాయతీకి చెందిన రామకృష్ణ కుమారుడు గంగాధర్(24) భవన నిర్మాణ కార్మికుడు. మూర్ఛ వ్యాధితో బాధపడుతుండడంతో వివాహ సంబంధాలు రాలేదు. ఆరోగ్యం కుదుట పడ్డాక వివాహం చేస్తామని తల్లిదండ్రులు కూడా చెప్పడంతో మనస్తాపం చెంది విషం తాగాడు. కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వాల్మీకిపురం మండలం విఠలం గ్రామానికి చెందిన నరసింహులు భార్య ఎల్లమ్మ(65) ఆరేళ్లుగా క్యాన్సర్ తో బాధపడుతోంది, ఇటీవల అనారోగ్యం ఎక్కువ కావడంతో గన్నేరు కాయలు తినింది. మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

కనులపండువగా చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం




కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు, హాజరైన భక్తులు

ములకలచెరువు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపూరికోట సమీపంలో శనివారం చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వేపూరికోట, కుటాగులోళ్లపల్లె, పెద్దయ్యగారిపల్లె, వేపూరికోట క్రాస్, గురికివారిపల్లె, చీకుచెట్టుపల్లె, ఆర్ఎస్ కొత్తపల్లె, ఎర్రకాలువపల్లె, ఉమాశంకర్‌కాలనీ, ఆవులవారిపల్లె, ఎద్దులవారిపల్లె, పెద్దపల్లె, బంగారువాండ్లపల్లె, రెడ్డివారిపల్లె, ఎస్సీ కాలనీల నుంచి భక్తులు తరలి వచ్చారు. పెళ్లి పెద్దలుగా నవీన్‌కుమార్, స్వర్ణ దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం విద్యుత్‌దీపాలంకరణ, మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధారెడ్డి, మాజీ ధర్మకర్త రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, లక్ష్మన్న, మూగి రవిచంద్ర, వేమారెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటాద్రి, శేషారెడ్డి, పిడుగు రెడ్డెప్ప, భాస్కర్‌రెడ్డి, అశోక్ కుమార్, పుల్లారెడ్డి, చలపతి, జయరాంరెడ్డి, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

కగార్ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

మదనపల్లె టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పలువురు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ అటవీ సంపద కొల్లకొట్టడానికే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిర్వహిస్తోందని ఆరోపించారు. మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పాలన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం మాట్లాడుతూ ఉద్యమకారులను కేంద్ర ప్రభుత్వం అణగదొక్కడం దారుణమన్నారు. వ్యక్తులను అంతం చేసినంత మాత్రాన ఉద్యమాలు అంతం కావన్నారు. బహుజనసేన అధ్యక్షుడు శ్రీచందు మాట్లాడుతూ కగార్‌పై హోంమంత్రి ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. పేద, బడుగులకు చేదోడుగా ఉండాల్సిన ప్రభుత్వం పేదల కోసం పోరాడుతున్న వ్యక్తులను అంతం చేయడం సరికాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు మాట్లాడుతూ కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను కూడా వారి బంధువులకు అప్పగించలేదన్నారు. ఈ సమావేశంలో ఏపీసీఎల్సీ నాయకుడు నాగేశ్వరరావు, న్యాయవాది సోమశేఖర్, సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళి పాల్గొన్నారు.

తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జిగా భవ్యశ్రీ



కుటుంబ సభ్యులతో భవ్యశ్రీ

కడప రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కడపకు చెందిన యువతి అతి పిన్న వయసులోనే తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక య్యారు. త్వరలో న్యాయాధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

తండ్రి ప్రోత్సాహంతో..

కడప నగరంలో నివాసం ఉంటున్న పసుపులేటి చంద్ర, మాధురీదేవి కుమార్తె భవ్యశ్రీ. పసుపులేటి చంద్ర ప్రస్తుతం అట్లూరు పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా తరచూ కోర్టుకు వెళ్లేవారు. ఆ సమయంలోనే తమ బిడ్డను న్యాయమూర్తిగా చూడాలనుకున్నారు. అందు లో భాగంగా భవ్యశ్రీకి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ జూనియర్ కళాశాలలో క్లాట్ శిక్షణ ఇప్పించారు. ఇంటర్మీడియట్ పూర్తి కాగానే వైజాగ్‌లోని దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీలో ఐదేళ్ల లా కోర్సులో చేర్పించారు. కోర్సు పూర్తయిన తరువాత 2023లో తెలంగాణ హైకోర్టులోను, 2024లో ఏపీ హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2024లో తెలంగాణ హైకోర్టు నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్ ఇంటర్వ్యూలోను చక్కని ప్రతిభ చూపి 24 ఏళ్ల వయసులోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు.

న్యాయం వైపు నిలబడ్డమే ప్రధాన విధి

న్యాయం వైపు నిలవడమే ప్రధాన విధిగా భావిస్తా. తండ్రి కోరిక మేరకు లా చదివి జడ్జిని అయ్యాను. లా కాలేజీలో మంచి ఫౌండేషన్ ఏర్పడింది. జూనియర్ సివిల్ జడ్జి నోటిఫికేషన్ పడినప్పటి నుంచి సాధన చేశాను. సీనియర్ జడ్జిల సెమినార్లకు హాజరు కావడంతో పాటు, కోర్టుకు వెళుతూనే, ఎలాంటి కోచింగ్ లేకుండా రోజుకు 8 నుంచి 12 గంటలు శ్రమించాను. తొలి ప్రయత్నంలోనే జడ్జిగా ఎంపికయ్యా. చట్టాలకు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులకు లోబడి, సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగానే విధులు నిర్వహిస్తా.

- పసుపులేటి భవ్యశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గాలివీడు, జూన్7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బాధ తాళలేక ఓ వ్యక్తి విషం తాగి న వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు... గోరాన్‌చెరువు గ్రామం మండివాండ్లపల్లి ఎస్టీ కాలనీకి చెందిన నచ్చుకూరి లక్ష్మయ్య (59)కు పదే పదే మూర్ఛ వ్యాధి వస్తుండటంతో మనస్తాపం చెందేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది జూన్ 1వ తేదీ పింఛన్ డబ్బులు తీసుకున్నాడు. సాయంత్రం 6 గంటల సమయంలో పొలం దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా పొలం వద్ద స్పృహ తప్పిపడిపోయి కనిపించాడు. 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ లక్ష్మయ్య శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పూజారికి గాయాలు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుళారం చిన్నరాసిపల్లె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయచోటి మాసా పేట గంగమ్మ దేవాలయ పూజారి చెంద్రాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం కాకుళారం గ్రామానికి వెళ్లి వస్తుండగా కొత్తరాసిపల్లె వద్ద స్కూటర్ ఢీకొని కింద పడ్డారు. దీంతో గాయపడిన అతనిని స్థానికులు 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టీడీపీకి సుగవాసి బాలసుబ్రమణ్యం రాజీనామా

- చంద్రబాబుకు లేఖ



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు పెద్దకుమారుడు, ఉమ్మడి కడప జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బాలసుబ్రమణ్యం శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖను పంపించారు. ఆరు నెలలుగా ప్రజలు, అభిమానులు, కార్యకర్తల అభిప్రాయం తీసుకుని వారి మనోభావాల ప్రకారం రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో ఆయన రాజంపేట అసెంబ్లీకి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే ఇతను టీడీపీకి రాజీనామా చేయడం జిల్లాలో రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది.

2024 ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీకి పోటీ

సుగవాసి బాలసుబ్రమణ్యం 1995 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. రాయచోటి జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. 2000 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి కడప జిల్లా పరిషత్ చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి తెలుగుదేశం పార్టీకి, జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన సమయంలో ఆయన కొద్ది కాలం పాటు జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేశారు. 2001లో మళ్లీ రాయచోటి జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2012లో జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో టీడీపీ తరపున రాజంపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమి చెందారు.

ఓటమి తర్వాత పార్టీతో పెరిగిన దూరం

43 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో ఉంటున్న సుగవాసి పాలకొండ్రాయుడు కుటుంబానికి 2012 ఉప ఎన్నికల తర్వాత.. 2014, 2019 సాధారణ ఎన్నికల్లో పార్టీ టికెట్టు కేటాయించలేదు. 2024లో రాయచోటి అసెంబ్లీ టికెట్టును పాలకొండ్రాయుడు కుమారులు బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులు ఆశించారు. ఒకానొక దశలో రాజంపేట పార్లమెంటు స్థానానికి బాలసుబ్రమణ్యం పేరును పార్టీ ఖరారు చేస్తుందనుకున్నారు. అయితే రాజంపేట పార్లమెంటు టికెట్టును బీజేపీ తరపున మాజీ ముఖ్యమంత్రినల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించడంతో బాలసుబ్రమణ్యంకు రాజంపేట అసెంబ్లీ సీటును కేటాయించారు. జిల్లాలో తప్పకుండా గెలుస్తుందనుకున్న సీట్లలో రాజంపేట పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. అయితే కొందరు నాయకులు తమ రాజకీయ మనుగడ కోసం బాలసుబ్రమణ్యం ఓటమికి కారకులయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ విషయమై గందరగోళం ఏర్పడింది. సాధారణంగా తెలుగుదేశం పార్టీ పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తుంది. అయితే ఇక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోసం పలువురు నాయకుల మధ్య పోటీ నెలకొంది. పేరుకే బాలసుబ్రమణ్యంను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించినప్పటికీ అతను చెప్పిన పనులు నియోజకవర్గంలో ఏమీ జరగలేదు. రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు సిఫార్సులను పరిగణలోకి తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగానికి ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో సుమారు ఆరేడు నెలలుగా బాలసుబ్రమణ్యం, టీడీపీ అధిష్టానానికి మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. పార్టీ కార్యక్రమాలకు సైతం బాలసుబ్రమణ్యం దూరంగా ఉంటూ వచ్చారు. గత నెలలో పాలకొండ్రాయుడు మృతి చెందారు. ఆయన కడసారి చూపు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తారని అందరూ ఊహించారు. ఆయన రాకపోవడంతో సుగవాసి కుటుంబానికి పార్టీలో ఏమాత్రం గౌరవం లేదనే అభిప్రాయం ఆయన వర్గీయుల్లో ఏర్పడింది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి బాలసుబ్రమణ్యం రాజీనామా చేశారు. ప్రస్తుతం ఈయన రాజీనామా వ్యవహారంపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

టీడీపీని వదలను..

తన సోదరుడు బాలసుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయడం ఆయన వ్యక్తిగత విషయం. సోషల్ మీడియా ద్వారానే ఆయన రాజీనామా విషయం నాకు తెలిసింది. నేను ఎటువంటి పరిస్థితుల్లోనూ టీడీపీని వదలను. కొందరు రాజకీయంగా మమ్మలను దెబ్బకొట్టారు.

- సుగవాసి ప్రసాద్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

నిత్యపూజ కోనలో పారిశుధ్య పనులు

సిద్దవటం, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): నిత్యపూజకోనలో అపరిశుభ్రత, వసతుల లేమి సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎండోమెంట్‌శాఖ అధికారు లు స్పందించారు. శనివారం తాగునీటి గుండాల్లో పారిశుధ్య ప నులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ పంచలింగాల గుడి వద్ద నీటి గుండాల్లో ఉన్న ప్లాస్టిక్ వంటి పదార్థాలు తొలగించి బ్లీచింగ్ వేశామని, మహిళలు దుస్తులు మార్చుకునే గది నిర్మాణం విష యం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కాలిబాటకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగిం చామని తెలిపారు.

దశాబ్దం తరువాత నెరవేరిన కల

● రూ.4.15 కోట్లతో రోడ్లు ఏర్పాటు

● గ్రామీణ ప్రజలు, రైతుల హర్షం



కొండపేట చెరువుకట్టపై బీటీ రోడ్డు వేసేందుకు కంకర పరిచిన దృశ్యం

చెన్నూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): దశాబ్దం తరువాత రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ప్రజలు, రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద 1.85 కోట్లు, నాబార్డు నిధుల కింద రూ.2.30 కోట్లు మంజూరయ్యాయి. మొత్తంగా రూ.4.15 కోట్లతో బయనపల్లె, బలసింగాయపల్లెలో సుమారు 20 కి.మీ మేర సిమెంటు రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేస్తున్నారు. దీంతో ఎన్నో ఏళ్ల తరువాత మా కల నెరవేరుతోందని ప్రజలు ఆనందరం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన కాలనీలకు మహర్దశ

బలసింగాయపల్లె గ్రామ పంచాయతీలో దౌలతాపురం ఎస్టీకాలనీ, రనామాపురం ఎస్టీకాలనీ, కైలాసగిరికోన ఎస్టీకాలనీలు కొండ దిగువన ఉండేవి. గతంలో ఈ కాలనీలకు సరైన దారి సౌకర్యం లేక మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బంది పడేవారు. ఇలాంటి పరిస్థితుల్లో సుమారు పదేళ్ల క్రితం పీఎంజీఎస్‌వై కింద అప్పట్లో రూ.కోటి 15 లక్షలతో సీసీరోడ్లు, బీటీ రోడ్డు మంజూరైనా కాలక్రమేణా ఆ దారి పూర్తిగా దెబ్బతింది. దీంతో ఆ ప్రాంత ప్రజలతోపాటు ఆ దారిలో ఉన్న పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు నాబార్డు, పీఎంజీఎస్‌వై కింద రూ.4.15 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ఆ గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తయిన సీసీరోడ్లు

దౌలతాపురం ఎస్టీకాలనీ నుంచి ఎస్‌రామాపురం కాలనీ మీదుగా కైలాసగిరికోన వరకు ప్రస్తుతం సీసీరోడ్లు పూర్తి చేశారు. సుమారు రెండున్నర కిలోమీటరు మేర సీసీరోడ్లు ఏర్పాటుతో రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి. అలాగే కొండపేట చెరువుకట్టపై బీటీ రోడ్డుకు కంకర తోలి రోడ్డు వేసేందుకు సిద్ధం చేశారు. సుమారు కిలోమీటరు మేర ఈ రోడ్డు ఏర్పాటు కానుంది. అదేసమయంలో చెరువుకట్టపై బీటీ రోడ్డు ఎస్టీ రామాపురం కాలనీని కలిపే మధ్యలో కొండపేట చెరువు అలుగు పారేందుకు నాణ్యతతో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. అలాగే జాతీయ రహదారిలో దౌలతాపురం క్రాసింగ్ నుంచి చెక్కెర ఫ్యాక్టరీ వరకు, బయనపల్లె నుంచి బలసింగాయపల్లె వరకు బీటీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నిత్యం ఈదారిన తిరిగే వందలాది మంది రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కైలాస్‌గిరి కోనకు వెళ్లే దారిలో వేసిన రోడ్డు



బయనపల్లె, బలసింగాయపల్లె మధ్య తారురోడ్డు వేసేందుకు గ్రావెల్ వేసిన దృశ్యం



చాలాకాలం తరవాత నెరవేరిన కల

కొండపేట చెరువు కట్టపై బీటీ రోడ్డు ఏర్పాటు కావడం సంతోషకరం. ఈరోడ్డు ఏర్పాటుతో గ్రామ ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆయకట్టు రైతులకు పంటల నూర్పిడి కాలంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు.

- ఎం.మోహన్‌రెడ్డి,
మాజీ సర్పంచ్, బయనపల్లె



రోడ్డు వెడల్పు చేస్తున్నారు

బయనపల్లె, బలసింగాయపల్లెల మధ్య ఉన్న బీటీ రోడ్డు దారుణంగా దెబ్బతిని రాకపోలకు ఇబ్బందగా ఉండేది. ఇప్పుడు ఆ సమస్య తీరింది. ఇక రైతులు ప్రజలకు రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

- ఓ.విజయభాస్కర్‌రెడ్డి,
బలసింగాయపల్లె

తాగునీరు ఇవ్వడమే లక్ష్యంగా పనిచేయాలి

● కేంద్ర జల్‌జీవన్ మిషన్ ప్రతినిధి మీను శుక్ల పాఠక్



అధికారుల సమావేశంలో మీనా శుక్లా పాఠక్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందేలా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని జల్ జీవన్ మిషన్ ప్రతినిధి మీను శుక్లా పాఠక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సహాయంతో చేపడుతున్న జల్ జీవన్ మిషన్ పథకంపై కేంద్ర ప్రభుత్వం తరఫున వచ్చిన ప్రతినిధులైన మీను శుక్ల పాఠక్, ఎస్పీ శెట్టి, (చీఫ్ ఇంజనీర్, హర్యానా) గ్రామీణ నీటి సరఫరా శాఖ, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల పీడీ డ్వామా, పీడీ డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ అధికారి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా 3709 పనులు మంజూరయ్యారని, ఇందులో 2225 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని మొత్తం 44 మండలాల్లోని 6967 నివాసాల్లో నివసిస్తున్న 31 లక్షల 87 వేల 66 మందికి రెండు విడతల్లో గండికోట, వెలిగల్లు రిజర్వాయర్ల ద్వారా కరువు ప్రాంతాలకు తాగునీటిని అందించడం కోసం 2370 కోట్ల రూపాయలతో ఏప్రిల్ 2025లో ప్రారంభించబడిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు 2027 అక్టోబరు కల్లా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా భౌగోళిక స్వరూపం వల్ల వర్షపాతం తక్కువగా ఉంటుందని, భూగర్భజలాలు ప్రజలందరికీ అందుబాటులో లేవని, జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా అత్యంత అవసరమని కేంద్ర ప్రభుత్వ బృందానికి వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ క్రికెట్ విజేత అనంతపురం



విజేతగా నిలిచిన అనంతపురం జట్టు

కడప స్పోర్ట్స్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నెట్‌రన్‌రేట్ ప్రాతిపదికన అనంతపురం జట్టును నిర్వాహకులు ప్రకటించారు. అనంతపురం జట్టు ఆడిన 4 మ్యాచ్‌లకు గాను 3 మ్యాచ్‌లలో విజయం సాధించి ఒక్క మ్యాచ్ ఓడిపోయింది. దీంతో 12 పాయింట్లతో నెట్‌రన్‌రేట్ 1.768 సాధించి మిగతా జట్ల కన్నా మెరుగైన స్థితిలో నిలిచింది. ఇదిలా వుండగా నెల్లూరు, చిత్తూరు జట్లు సైతం ఆడిన నాలు గింటిలో మూడు మ్యాచ్‌లలో విజయం సాధించి పాయింట్ల పరంగా 12 పాయింట్లు సాధించినప్పటికీ నెట్ రన్‌రేట్‌లో నెల్లూ రు జట్టు 1.05, చిత్తూరు జట్టు 0.610 సాధించాయి. ఈ క్రమంలో కడప జట్టు ఆడిన నాలుగింటిలో మూడు మ్యాచ్‌లలో ఓటమి పాలై ఒక్క మ్యాచ్‌లో గెలుపొంది 4 పాయింట్లు మాత్రమే సాధించింది. కాగా కర్నూలు జట్టు ఆడిన నాలుగు మ్యాచ్ లలో ఓడిపోయి చివరి స్థానంలో నిలిచింది. చివరి రోజైన శని వారం ఆడిన మ్యాచ్‌లలో కర్నూలు జట్టుపై చిత్తూరు గెలు పొందగా మరో మ్యాచ్‌లో కడప జట్టుపై అనంతపురం జట్టు విజయం సాధించింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో ఆదివారం చిత్తూరు- కర్నూలు జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్‌కు దిగి 44.4 ఓవర్లలో కేవలం 208 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సాయిసూర్యతేజ 80 పరుగులు, యెగ్నేశ్వర్ 51 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్ రెడ్డిప్రకాష్ 5 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు కేవలం 23.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో లోహిత్‌లక్ష్మీనారాయణ 86 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. మరో బ్యాట్స్‌మెన్ తేజారెడ్డి 62 పరుగులు చేసి జట్టును గెలిపించారు. అలాగే వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత టాస్‌నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి 35.2 ఓవర్లలో 151 పరుగుల స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయింది. ఇందులో ఆయుబ్ 52 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 22.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో అర్జున్ టెండూల్కర్ 78 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టు 6 వికెట్లతో గెలుపొందింది.





5 వికెట్లు సాధించిన రెడ్డి ప్రకాష్ (చిత్తూరు), 86 పరుగులు చేసిన లోహిత్ లక్ష్మీనారాయణ (చిత్తూరు)

కమీషన్ల కోసమే పోలవరం-బనకచర్ల

● ఏపీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వెలిగొండ, తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, అన్నమయ్య, పించ, ఝురికోన లాంటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తిచేస్తే సస్యశ్యామలం అవుతుందని ఏపీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిధులు లేని కారణంగా కొన్ని ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మరికొన్ని నత్తనడక నేర్చుతున్నాయన్నారు. ఈ నేపధ్యంలో రూ.81,900 కోట్లతో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు కోసం టెండర్లు పిలవాలని చంద్రబాబు ప్రభుత్వం తహతహలాడడం విడ్డూరమన్నారు. మొదటి దశలో పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు, రెండవ దశలో ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లె రిజర్వాయర్ వరకు, మూడవ దశలో బొల్లాపల్లె రిజర్వాయర్ నుంచి బనకచర్ల వరకు అన్నారు. ఇందులో 50శాతం అంటే రూ.40,950 కోట్లు ప్రపంచ బ్యాంకు, తదితర అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి అప్పు, 20 శాతం అంటే రూ.16,380 కోట్లు కాంట్రాక్టర్ ముందు భరించి తర్వాత రైతుల నుంచి రాబట్టుకో వాలట, 20శాతం కేంద్రం, 10శాతం రాష్ట్రం భరిస్తాయట అన్నారు. ఇప్పటి వరకు పర్యావరణ, అటవీ, వన్యప్రాణి సంర క్షణ శాఖ, కేంద్ర జల సంఘం, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, గోదావరి నది యాజమాన్య బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేవన్నారు. అయినప్పటికీ టెండర్లు పిలవాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించడం విడ్డూరమన్నారు. ఈ తొందరంతా కమీషన్ల కక్కుర్తి కోసమే అని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు మరో కాళేశ్వరం అవుతుందన్నారు.

మామిడికాయల లారీ బోల్తా



రోడ్డుకు అడ్డంగా బోల్తాపడిన లారీ, అందులోని మామికాయల బాక్సులు

దువ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇడమడక చెక్‌పోస్టు వద్ద శనివారం లారీ అదుపు తప్పి బోల్తాపడింది. మామిడికాయల లోడుతో తిరుపతి నుంచి హర్యానా వెళుతున్న 12 టైర్లతో కూడిన లారీ అదుపు తప్పి రోడ్డుమీద పడింది. సంఘటనలో ఎటువంటి ప్రాణాపాయం జరుగలేదు. లారీలోని మామిడికాయల బాక్సులు చెల్లాచెదురుగా పడిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం జరిగింది.
పోలీసులు స్థానికులతో కలిసి లారీని, బాక్సులను తొలగించే ప్రయత్నం చేశారు. చాలాసేపు శ్రమించి బోల్తాపడిన వాహనాన్ని తొలగించారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులు ధ్రువీకరించారు.

చీనీ చెట్ల నరికివేత కేసులో ముగ్గురి అరెస్టు

కొండాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) :మండలంలో ఎనమలచింతల గ్రామంలో గురువారం రాత్రి ప్రసాద్ అనే రైతుకు చెందిన 41 చీనీ చెట్ల నరికివేత కేసులో శనివారం ముగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇదే గ్రామానికి చెందిన అంజి, రెడ్డిపల్లె నాగేశ్, రెడ్డిపల్లె నాగార్జున అనే ముగ్గురిని అరెస్టు చేసినట్లు తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. వీరిని కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు.

మాగిపోయి... రాలిపోతున్న మామిడి

● ధరలు లేక తోటలపై వదిలేస్తున్న రైతులు ● అడ్వాన్సులు ఇచ్చి.. ముందుకు రాని వ్యాపారులు

● ఎగుమతులు లేకపోవడంతోనే దుస్థితి ● పట్టించుకోని ప్రభుత్వాలు



గడ్డంవారిపల్లె గ్రామంలో రాలిపోయిన మామిడిపండ్లు



ధర లేక మామిడికాయల గోడౌన్ వద్ద నిరీక్షిస్తున్న రైతు వెంకటసుబ్బయ్య



మహదేవపల్లె గ్రామంలో ధరలు లేకపోవడంతో చెట్లపైనే నిలిచిపోయిన మామిడి కాయలు

చక్రాయపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అసలే అరొకొరగా కాసిన కాపు.. ఆపై ధరలు లేక మామిడి రైతులు దిగాలు చెందుతున్నారు. మామిడికాయలు అడిగే నాధుడు లేక చెట్లకే మాగిపోయి కింద రాలిపోతున్నాయి. ఒకవేళ రైతులు మామిడికాయలను గోడౌన్‌లకు తీసుకెళ్లినా మాకు వద్దు మహాప్రభో అంటున్నారు వ్యాపారులు. దీనికి ఎగుమతులు లేకపోవడమే కారణం. ఇప్పటికే రైతుల నుంచి కొనుగోలు చేసిన కాయలు గోడౌన్‌లలో మగ్గిపోతున్నాయని వాపోతున్నారు. దీంతో రైతులు మామిడికాయలను తోటల్లోనే వదిలివేయాల్సి దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే..

మండలంలో ప్రధానమైన పంటల్లో మామిడి పంట ఒకటి. చక్రాయపేట మండలంలోని సురభి, చిలేకాంపల్లె, గడ్డంవారిపల్లె,మహదేవపల్లె, గంగారపువాండ్లపల్లె, గొట్లమిట్ల, ఎర్రగుడి, కుప్పం, నెర్సుపల్లె తదితర ప్రాంతాలలో దాదాపు 2వేల హెక్టార్లలో మామిడి విరివిగా సాగుచేశారు. అలాగే వీరబల్లె, రామాపురం, వేంపల్లె, తలుపుల, ఎన్‌పీకుంట తదితర ప్రాంతాలలో మామిడి సాగుచేసిన రైతులు ధరలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ పండించిన మామిడి కాయలను వ్యాపారులు సురభి గ్రామంలో ఏర్పాటు చేసిన గోడౌన్‌లకు తరలించి ఎగుమతి చేసి డబ్బులు సంపాదించేవారు. కానీ ఈ ఏడాది ధరలు పూర్తిగా పడిపోవడంతో వ్యాపారులు మామిడి తోటలవైపు చూడటం లేదు. ఒకప్పుడు బెనిషీలాంటివి టన్ను రూ.50 వేల రూపాయలు పలికితే నేడు కనీసం టన్ను రూ.5వేలు కూడా అడిగేవాడు లేడు. రైతులే గోడౌన్‌లకు పోయి మా కాయలు తీసుకోస్తామంటే వ్యాపారులు వద్దంటే వద్దు అంటున్నారు. దీంతో రైతులు ఏమి చేయాలో అర్థంకాక తోటల్లో మామిడికాయలు కోయకపోవడంతో పూర్తిగా మాగిరాలిపోతున్నాయి. పంట సాగు కోసం లక్షల రూపాయలు పెట్టుబడి పెడితే దిగుబడి వచ్చే సమ యంలో ఇలా ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

నేడు రూ.2 కోట్లు వ్యాపారం..

మండలంలో సురభి గ్రామంలో ఐదారు మామిడికాయల గోడౌన్‌లు ఉన్నాయి. ప్రతి ఏడాది మామిడి సీజన్‌లో గోడౌన్లలో రూ.30 నుంచి రూ.40 కోట్ల మేర వ్యాపారం జరిగేదని వ్యాపారులు చెబుతున్నారు. కానీ ఏడాది కేడాది ఎగుమతులు లేక ధరలు పడిపోవడంతో రూ.2కోట్ల వ్యాపారం కూడా జరగలేదని లబోదిబోమంటున్నారు. ఇక మామిడి కాయలను గోడౌన్లకు తీసుకువచ్చినా అడిగే నాధుడు లేకపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు. కనీసం రూ.5వేలతో వేసుకోమని రైతులు బతిమలాడుతున్న మాకు వద్దని వ్యాపారులు అంటున్నారని కుప్పగుట్టపల్లెకు చెందిన రైతు వెంకటసుబ్బయ్య కంటతడిపెట్టాడు.



అడ్వాన్స్ ఇచ్చి వదిలేశారు

నాకు 20 ఎకరాల మామిడితోట ఉంది. ధర లేని కారణంగా అడ్వాన్స్ ఇచ్చినా వ్యాపారులు రాలేదు. పంట సాగుచేయడానికి ఏడాదికి దాదాపు రూ.5లక్షల నుంచి రూ.6లక్షలు ఖర్చు అయ్యింది. మామిడి పంటకు ఇన్సూరెన్స్ కట్టాము. కానీ బీమా రాలేదు. ఇన్సూరెన్స్ వస్తే కొంత ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

-వి.రామకృష్ణారెడ్డి,
తొట్టికాడపల్లె, చక్రాయపేట మండలం.

ఏపీ పోర్టల్‌లో పలు సేవలకు అంతరాయం

పులివెందుల రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయంలో ఏపీసేవ పోర్టల్ ద్వారా ప్రజలకు అందిస్తున్న పలు సేవలకు ఈనెల 10వ తేదీ వరకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ రాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీసేవ పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ అజ్యూర్ క్లౌడ్ నుంచి ఏపీరాష్ట్ర డేటా సెంటర్‌కి మైగ్రేషన్ (తరలింపు) చేపడుతోందన్నారు. ఈపనుల నిర్వహణ నిమిత్తం 10వ తేదీ మంగళవారం రాత్రి వరకు అంతరాయం ఉంటుందన్నారు. దీనితో ఆదాయ ధృవీకరణ, సమగ్ర ధృవీకరణ, భూమి మ్యుటేషన్లు,రేషన్ కార్డులు, ఇళ్ల స్థల పట్టాలు, వృద్ధాప్య, వివాహ ధృవీకరణ పత్రాలు, రెవెన్యూ వాటర్ ట్యాక్స్ పట్టణ పరిపాలన సంబంధిత సేవలు, మత్స్యశాఖ సేవలు అందుబాటులో ఉండవన్నారు. ప్రజలు గమనించాలని కమిషనర్ కోరారు.

వల్లూరు..: గ్రామ వార్డు సచివాలయాల్లో ఏపీ సేవా పోర్టల్ ద్వారా అందించే సేవలను ఈ నెల 7 నుంచి 10 వరకు నిలిపివేయబడిందని ఎంపీడీవో రఘురాం తెలిపారు. ఏపీ సేవా పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ క్లౌడ్ నుంచి ఏపీ రాష్ట్ర డేటా సెంటరుకు తరలించడం జరుగుతుందని తెలిపారు. కావున ఆదాయ, భూమి, రేషన్‌కార్డులు, ఇళ్ళస్థలాలు, వృద్ధాప్యపింఛన్లు, వివాహ ధృవీకరణ పత్రాలు, గ్రామ సచివాలయంపనిచేయవని ఎంపీడీవో ప్రకటనలో తెలిపారు.

పశువుల సంరక్షణ చేపట్టాలి

సీకేదిన్నె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులు వారి పశుసంపదపై దృష్టి పెట్టి పశువుల సంరక్షణ చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం పశువిజ్ఞాన శాస్త్రవేత్త విజయకుమార్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం అప్పరాజుపల్లె, గోపాలపురం గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు వ్యాధులబారీన పడకుండా రైతులు పశువుల పాకలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గొర్రెలు, మేకలు పెంపకం గురించి వాటికి వచ్చే వ్యాధుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కోళ్లలో వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ వేయించి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, నూనెగింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త కదిరివేల్ ,ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అంకయ్యకుమార్, శాస్త్రవేత్తలు జ్యోతిర్మయి, గిరీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేషన్ అక్రమార్కులపై కఠిన చర్యలు చేపట్టాలి'

కడప సెవెన్‌రోడ్స్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి డాక్యుమెంట్లు, ఆధారాలు లేకుండానే శివానందపురం వాసి పిచ్చమ్మ ఇంటి పన్ను పేరు మార్పుపై కార్పొరేషన్‌లోని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ ప్రకటనలో కోరారు. కార్పొరేషన్‌లో ఎటువంటి డాక్యుమెంట్ అప్‌లోడ్ చేయకుండా అక్రమంగా ఇంటి పన్ను మార్పుచేసిన సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. కాగా 9వ తేదీన సోమవారం ఉదయం 10 గంటలకు కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో రాజకీయ, ప్రజాసంఘాల అఖిలపక్ష నాయకులు హాజరై జయప్రదం చేయాలన్నారు.

ఇందిరానగర్‌లో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలి

సీకేదిన్నె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్‌లో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మూడు వేల కుటుంబాలు ఉండే ఇందిరానగర్‌లో కేవలం ఒక రేషన్ షాపు మాత్రమే ఉండడంతో ఇక్కడ 500 మందికి మాత్రమే రేషన్ పంపిణీ చేస్తున్నారని, మిగతావారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తుందని వారు తెలిపారు. ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన ఇక్కడ రేషన్ షాపును మంజూరు చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు వెంకటేష్, రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలి

కడప సెవెన్ రోడ్స్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):ముందుగా రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర శనివారం ఒకప్రకటనలో విమర్శించారు. పెండింగ్‌లో ఉన్నరాయలసీమ ప్రాజెక్టుల రెండో దశ పనులు పూర్తిచేయకుండానే, గోదావరి - బనకచర్ల పేరుతో రూ.80వేలకోట్లు కొల్లగొట్టే పథకానికి ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. చంద్రబాబు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నీటి కొరతకు శాశ్వత పరిష్కారం అంటూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో తెలుగు తల్లికి జలహారతి పేరుతో రూ.80112 కోట్ల అంచనా వ్యయంతో గోదావరి-బనకచర్ల ఎత్తిపోతల పథకానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఇవేవీ రాయలసీమ తాగు, సాగునీటి కష్టాలు తీర్చడం కోసం కాదని అధికార పార్టీ నేతల ఆర్థిక లోటును భర్తీ చేసుకోవడం కోసమేనని విమర్శించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



పులివెందుల రూరల్,జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమైన శిల్పారామంలో శనివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. బక్రీద్ పండుగను పురస్కరించుకొని శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో పులివెందుల యువరాజా డ్యాన్సింగ్ స్కూల్ బృందం శాస్త్రీయ, జానపద, సినీ పాటలకు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. నృత్య ప్రదర్శనలకు సందర్శకుల చప్పట్లు,ఈలలు, కేకలతో శిల్పారామం మారుమోగింది.



త్యాగానికి ప్రతీక బక్రీద్

చెన్నూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : దైవానికి ప్రీతిపాత్రులు కావాలంటే త్యాగమే ఉత్తమ మార్గమని చెన్నూరు ఇస్లాం మతగురువు రఫిక్ అన్నారు. బక్రీదు సందర్భంగా హజ్‌హౌస్ వద్ద శనివారం ముస్లింలు ప్రార్థనలు చేశారు. అలాగే చెన్నూరు ఖిల్లా షాహి మసీదు, కొండపేట, నజీర్‌బేగ్‌పల్లె, రామనపల్లె, ముండ్లపల్లె గ్రామాల్లో ముస్లిం లు బక్రీదు పండుగను ఎంతో సంతోషంగా జరుపుకున్నారు. అలాగే చెన్నూరులోని ముస్లిం శ్మశాన వాటికలో బక్రీదు సందర్భంగా తమ పెద్దలను స్మరించుకుంటూ వారికి ప్రీతికరమైన వస్తువులను సమాధుల వద్ద సమర్పించారు. అలాగే పేదలకు దాన ధర్మాలు చేశారు.

వల్లూరు..: బక్రీదు సందర్భంగా శనివారం ముస్లింలు ఈద్గాల వద్ద వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరంఇంటి వద్ద బంధుమిత్రులతో పండుగను చేసుకున్నారు.

సీకేదిన్నె..: చింతకొమ్మదిన్నెలో బక్రీదు పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా ఈద్గాల వద్ద ప్రార్థనలు చేపట్టారు.

వేంపల్లె..: వేంపల్లెలో భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకొన్నారు. ముస్లింలు ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుకొన్నారు. మౌలానా సందేశం వినిపించారు.

వీరపునాయునిపల్లె..: మండలంలోని ఎన్.పాలగిరి, గంగిరెడ్డిపల్లె, ఉరుటూరు, వీఎన్‌పల్లె, అనిమెల, మొయిళ్లచెరువు తదితరగ్రామాలలో శని వారం బక్రీద్ పండుగను ముస్లింలు జరుపుకొ న్నారు. మసీదులకు,దర్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు.

కమలాపురం రూరల్..: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీదు పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఈద్గాలో చిన్నచెప్పలి, కోగటం, పెద్దచెప్పలి తదితర గ్రామాల్లో ప్రార్థనలు నిర్వహించారు.

పులివెందుల రూరల్..: త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శనివారం ఉదయాన్నే పులివెందులలోని శ్రీరామహాల్ సర్కిల్, పార్నపల్లె రోడ్డు తదితర ప్రాంతాలలో ఉన్న ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

పెండ్లిమర్రి..: మండల పరిధిలోని కొండూరు, నందిమండలం,రంపతాడు,మొయిళ్లకాల్వ,గంగనపల్లె,తిప్పిరెడ్డిపల్లె,వెల్లటూరు తదితర గ్రామాల పరిధిలో శనివారం బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గాలలో మతగురువుల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

లింగాల..: లింగాల మండలంలో శనివారం ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లింగాల, వెలిదండ్ల, పెద్దకుడాల, పార్నపల్లె తదితర గ్రామాలలో బక్రీద్ వేడుకలు నిర్వహించారు.



కడప.. బక్రీద్ సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కమలాపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





చెన్నూరు హజ్‌హౌస్ వద్ద, వేంపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేయకపోతే ఉద్యమమే

నేడు డీఈఓ కార్యాలయం ముట్టడి ● ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక

కడప ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ విధానంలో బదిలీలు నిర్వహించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని నాయకులు సంగమేశ్వరరెడ్డి, శివారెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల జేఏసీ పిలుపుమేరకు ఆదివారం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. శనివారం డీఈఓ కార్యాలయం ఎదుట వెబ్‌కౌన్సెలింగ్ విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్టీయూ, పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ 257, ఏపీపీఎఫ్ 1938, ఆపస్, వైఎస్సార్‌టీఎఫ్, ఎస్‌పీఎఫ్, పీఈటీ సంఘం, ఎస్ఆర్‌టీఎఫ్,ఎన్‌టీఏ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తదితర నేతలు పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ప్రతినిధులు

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధానకార్యదర్శి మహేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ కాకుండా మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించాలి తెలిపారు.ఉపాధ్యాయ బదిలీల విషయంలో రాష్ట్ర విద్యాశాఖకు ఏఒక్క విషయంలోనూ స్పష్టత లేదని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన విధంగా కాకుండా ఇష్టం వచ్చిన రీతిలో బదిలీలు నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు సుజాత రాణి, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, రూతు ఆరోగ్యమేరీ, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, చంద్రశేఖర్, శంకర్‌రెడ్డి, దేవదత్తం, శివప్రసాద్ పాల్గొన్నారు.

సీకేదిన్నె..: ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాట ప్రకారం వెబ్ కౌన్సెలింగ్ బదులు మ్యానువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఐక్య ఉపాధ్యాయ సంఘాల పిలుపుమేరకు చింతకొమ్మదిన్నెలో నిరసన ప్రకటిస్తూ ఎంఈవోకు వినతి పత్రం సమర్పించారు. ఆదివారంలోగా ప్రకటించకపోతే విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం ఉపాధ్యాయులతో కలిసి చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుజ్జల తిరుపాల్, ఎంవీ క్రిష్ణప్రసాద్ తదితర ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీరాజా

'అద్వితీయం మోదీ అమృతపాలన'

కడప మారుతీనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ పాలన అద్వితీయంగా సాగుతోందని అమృత పాలనను తలపిస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు కొనియాడారు. కేంద్రంలో బీజేపీ పాలన చేపట్టి ఈనెల 9 నాటికి సరిగ్గా 11 సంవత్సరాలు పూర్తిచేసుకోనున్నదన్నారు. ఆ మేరకు శనివారం ఎన్‌జీఓ కాలనీలో గల బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ముందుకుసాగుతోందన్నారు. కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రగతి రూపురేఖలు మారుతున్నాయన్నారు. రాష్ట్రానికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కేంద్రం అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, కడప పార్లమెంట్ నాయకుడు బొమ్మన సుబ్బరాయుడు, కార్యదర్శి గాలి హరిప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, నాయకులు శివానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

వీరపునాయునిపల్లె,జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే వరుణదేవుడి కరుణ కోసం ఆకాశం వైపు కర్షకులు తలెత్తి చూస్తుంటారు. వరుణదేవుడు కరుణిస్తాడని వ్యవసాయ పనుల్లో దుక్కులు దున్ను తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంకాగానే జిల్లాలో వర్షాలు ఆరంభమయ్యాయి. జూన్ జూలైనెలలో ప్రధానంగా వర్షాధార పంటలైన వేరుశనగ, బుడ్డశనగ, పెసర, మినుములు, కంది, ఉలవ, అలసంద, ఆముదం వంటిరకాల పంటలను సాగుచేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు. రాయితీపై వేరుశనగ విత్తనాలు ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ జీన్‌లో 13 రకాల పంటలను లక్షల హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేయనున్నారు. ఈ పంట సాగుకు అవసరమైన విత్తనాన్ని రైతులకు 40శాతంతో ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. రైతులు పొలాల్లో సేద్యం పనుల్లో బిజీగా ఉన్నారు.



నేడు ఉచిత కంటి పరీక్ష శిబిరం

చక్రాయపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కల్లూరుపల్లె క్రాస్ వద్ద ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు గొకనపేట గ్రామ సర్పంచు జి.రామాంజులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కడపలో ఆపరేషన్‌లు కూడా ఉచితంగా చేస్తారన్నారు. ఉచితంగా భోజనవసతి, వాహన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

పిల్ల కాల్వలు పూర్తిచేయాలి

వేంపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో నీటిసమస్య తీవ్రంగా ఉందని, పైడిపాళెం,సీబీఆర్ నీరు ఉన్న పిల్ల కాల్వలు పూర్తిచేసి నీటిని అందించాలని, కాంగ్రెస్ పార్టీ పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి తెలిపారు. వేంపల్లెలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అమలు చేయని పథకాలను వెంటనే ప్రజలకు అందించాలని డిమాండ్‌చేశారు.

పల్లా శ్రీనివాసరావు తండ్రి మృతిపట్ల సంతాపం

పులివెందుల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతిచెందారు. ఆయన మృతిపట్ల పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) ఒక ప్రకటన ద్వారా తన సంతాపాన్ని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, పల్లా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రెడ్డిప్రసాద్



చెన్నూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుగా చెన్నూరుకు చెందిన రెడ్డి ప్రసాద్ నియ మితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు నుంచి సభ్యుడుగా నియామక ఉత్తర్వులు అందుకున్నా రన్నారు. ప్రజల్లోకి బీజేపీ సంక్షేమ పథ కాలు, అబివృద్ధి కార్యక్రమాలు తీసుకెళ్లి పార్టీ అబివృద్ధికి కృషిచేస్తామన్నారు.

జడ్పీ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు



చక్రాయపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ సాధించిన నాగులగుట్టపల్లె జడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సూర్యనాగమునిరెడ్డి తెలిపారు. శివశ్రీ, లిఖిత, జశ్వంత్ పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. వీరికి అవార్డు కింద రూ.20 వేలు నగదు, మెడల్, ప్రశంసాపత్రం అందజేస్తారని తెలిపారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అబినందించారు.

రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

కడప క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని పోలీసుస్టేషన్ల పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులకు, యువతకు, ఆటో, ట్యాక్సీ, లారీ డ్రైవర్లకు ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడపడం, మద్యం తాగి వాహనం నడపడం, సీటుబెల్టు ఉపయోగించకపోవడం, మొబైల్‌ఫోనులో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంలాంటివి ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. ఆటోలు, ట్యాక్సీలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. అలాగే ద్విచక్రవాహనాల్లో ట్రిపుల్ రైడింగ్ చేయకూడదన్నారు.



కౌన్సెలింగ్ చేస్తున్న వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం తప్పదు

● మూడో రోజు ధర్నాలో ఐసీయల్ కాంట్రాక్ట్ కార్మికులు


ఎర్రగుంట్ల ఐసీయల్ మెయిన్‌గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఎర్రగుంట్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం తప్పదని ఐసీయల్ కాంట్రాక్ట్ కార్మికులు స్పష్టం చేశా రు. న్యాయమైన సమస్యలు పరి ష్కరించాలని గత నెలరోజులుగా ఐసీయల్ ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు లోడింగ్‌కు వెళ్లకుండా విధులు బహిష్కరించారు. మూడు రోజుల నుంచి మెయిన్ గేటు వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. అయిన యాజమాన్యం మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఎర్రగుంట్ల ఆల్ట్రాటెక్ (ఐసీయల్) కార్మాగారంలో సుమారు 50 మంది ప్యాకింగ్ ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. ఈసందర్భంగా .కార్మికులు కె.సాంబశివారెడ్డి, అంజనేయులు, చంద్రశేఖర్ నాయుడు, శేఖర్, శ్రీనివాసులు మాట్లాడుతూ మస్టర్ రూ.470 మాత్రమే ఇస్తున్నారు. దీన్ని ఇతర ఫ్యాక్టరీల్లో మాదిరిగా రూ.800లకు పెంచాలని నెలలో 26పనిదినాలు కల్పిం చాలని డిమాండ్ చేశారు. విధినిర్వహణలో కార్మికులకు ప్రమాదం జరిగితే పూర్తి ఆసుపత్రి ఖర్చులు భరించాలని దుమ్ములో, వేడిలో పనిచేస్తున్నామని కనీస వసతులు కల్పించాలని కోరారు. ఇదిలా ఉండగా ఐసీయల్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

పోరుమామిళ్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులకు జనసేన ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. శనివారం రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు జనసేన నాయకులు నగరి రమణయ్య, రామాయణపు రామ్మోహన్, కడప సిద్దయ్య, గురప్ప, నగరి శ్రీనివాసులు, కొత్త రామాయణపువీధి ఉపాధి శ్రామికులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు


ప్రొద్దుటూరులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



జమ్మలమడుగులో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

మైదుకూరు ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ వేడుకలను శనివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. భక్తి, త్యాగానికి ప్రతీక బక్రీదు పండుగ అని మౌలానా మేరాజ్ రజా పేర్కొన్నారు. శనివారం బక్రీదు పర్వదినం సందర్భంగా కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీదు అల్లా చూపిన సన్మార్గంలో నడుచుకుని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఖాజీ ఇనాయతుల్లా ఖురాన్ గొప్పతనాన్ని, బక్రీదు పండుగ ప్రాధాన్యతను, నమాజ్ విశిష్టతను వివరించారు. ప్రార్థనలు అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ కార్యదర్శి ఖురేషి ఇలియాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లవరం బాషా, కోశాధికారి వల్లి, సభ్యులు షాదిక్, మత పెద్దలు, మైనార్టీలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: బక్రీద్ పండుగ సందర్భంగా గౌషియా పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రి సందేశమిస్తూ త్యాగానికి ప్రతీకగా బక్రీదు పండుగ జరుపుకుంటున్నట్లు తెలిపారు. మహ్మద్ ప్రవక్త ఇబ్రహీం త్యాగానికి చిహ్నంగా ప్రపంచంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీదు పండుగ నిర్వహిస్తున్నారన్నారు. అలాగే జామియా మసీదు పీఠాధిపతి షాదిక్‌పాషాఖాద్రి వెంకటేశ్వర కాలనీలోని ఈద్గా వద్ద బక్రీదు పండుగ విశిష్టతను వివరిం చారు. మహ్మద్ ప్రవక్త ఇబ్రహీంకు లేక లేక కలిగిన కుమారుడు అయినా ఇస్మాయిల్‌ను అల్లాహ్ ఆదేశాల మేరకు త్యాగానికి సిద్ధపడ్డాడు. జవా చేస్తున్నప్పుడు స్వర్గలోకం నుంచి ఒక పొట్టేలును పంపి అక్కడ ఇస్మాయిల్‌ను కాపాడారని వారు చేసిన త్యాగానికి ప్రతీకగా బక్రీదు పండుగ జరుపుకోవడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మైదుకూరు రూరల్‌లో :మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలోని బక్రీద్ పండగను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయాన్నే ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొంటు పండుగ శుభాకాంక్షలు చెపుకొన్నారు. సీఐ రమణారెడ్డి, ఎస్ఐ చిరంజీవి, సుబ్బారావులు పండుగను సజావుగా జరుపుకొనేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

బద్వేలులో: బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం పేదలకు దాన, ధర్మాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, సీఐ రాజగోపాల్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణలు మసీదుల వద్ద ప్రత్యేక సదుపాయాలు నిర్వహించడంతోపాటు శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

కొండాపురంలో : మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొండాపురంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్ద బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు.ఈ సందర్భంగా ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పోరుమామిళ్లలో: బక్రీదు వేడుకలు పోరుమామిళ్ల రంగసముద్రం పంచాయతీల్లో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. శనివారం బక్రీదు పండుగను పురస్కరించుకుని మహబూబ్‌నగర్ కాలనీలోని ఈద్గా వద్ద ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని టేకూరుపేట, రజాసాహెబ్‌పేట తదితర ప్రాంతాల్లో ముస్లింలు వేడుకలను నిర్వహించుకున్నారు.

కాశినాయనలో:త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ముస్లీం మతగురువు పేర్కొన్నారు. శనివారం బక్రీద్ పండుగను నర్సాపురం, అంభవరం, గంగనపల్లె, గొంటువారిపల్లె తదితర గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా ఈద్గాలవద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు తమకు దాన.ధర్మాలు చేశారు.

చాపాడులో: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీదు పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. చాపాడు, మడూరు, అన్నవరం, రాజుపాళెం, వెదురూరు, తిమ్మాయపల్లెగ్రామాల్లో ముస్లింలు పండుగ చేసుకున్నారు.

దువ్వూరులో: దువ్వూరులో శనివారం బక్రీదు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాత దువ్వూరులోని ఈద్గా వద్దకు వెళ్లి ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముసిం మత గురువు బక్రీదు పండుగ ప్రాధాన్యత గురించి వివరించారు. మనిషి సంపాదనలో తోటి పేద వారికోసం కొంత ఖర్చు చేయాలన్నారు.

మైలవరంలో:మండల పరిధిలోని దొమ్మరనంద్యాల, మైలవరం, నార్జాంపల్లె, దొడియం, తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీదు పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో ఈద్గా ప్రాంగణంలో ఘనంగా ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి ప్రతీక అయిన బక్రీదు పర్వదినం సందర్భంగా ఇమాంలు సందేశమిచ్చారు. ప్రార్థనలు తర్వాత ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీదు వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

ముద్దనూరులో:మండలంలో బక్రీద్ వేడుకలను శనివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం జమ్మలమడుగు రోడ్డులోని మసీదు వద్ద నుంచి తాడిపత్రి రోడ్డులోని ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎర్రగుంట్లలో: బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక వలసపల్లెరోడ్డులోని ఈద్గాలో వేలాది మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. బక్రీద్ ప్రాధాన్యతను గురించి మతపెద్దలు ఉపన్యసించారు. ఒకరినొకకు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రాజుపాలెంలో: మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామ శివార్లలో ఉన్న ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి అక్కడ గురువుల ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు. ఈ పండుగను టంగుటూరు, తొండలదిన్నె, కొరపాడు, గోపల్లె గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు.

కలసపాడులో: బక్రీద్ పర్వదినాన్ని శనివారం కలసపాడు మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కలసపాడు, ఎగువ రామాపురంలోని ఈద్గాలో ప్రజలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కలసపాడు పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఏషియన్ యూత్ గేమ్స్ తైక్వాండో సెలక్షన్స్

పోరుమామిళ్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాశిక్ పట్టణంలో గల డివిజన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 9, 10, 11 తేదీల్లో తైక్వాండో సెలక్షన్స్ జరుగుతాయని జిల్లా తైక్వాండో క్రీడా ఇన్‌చార్జ్ గురుస్వామి, ప్రధాన కార్యదర్శి మునీశ్వర్ తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా తైక్వాండో క్రీడాకారులు మూడో ఏషియన్ యూత్ గేమ్స్ ఎంపికకు సిద్ధం కావాలని అసోసియేషన్ పిలుపునిచ్చిందన్నారు. బహ్రెయిన్ దేశంలో జరిగే మూడో ఏషియన్ యూత్‌గేమ్స్‌కు సంబంధించి తైక్వాండో ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్‌ను ఇండియా తైక్వాండో మహారాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 9, 10, 11 తేదీల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఈ నెల 8లోపు తమ పేర్లను రిజిస్టరు చేయించుకోవాలన్నారు. పోటీలకు 15 నుంచి 16 ఏళ్ల వయసు కలిగిన బాలబాలికలు అర్హులన్నారు. మొత్తం ఐదు వెయిట్ కేటగిరిలలో పోటీలుఉంటాయని ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 22 నుంచి 31 వరకు బహ్రెయిన్‌లో జరిగే మూడో ఏషియన్ యూత్ గేమ్స్‌లో మనదేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తా రన్నారు. మరిన్ని వివరాలకు 9110556525ను సంప్రదించాలన్నారు.

గండికోటలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు హర్షణీయం

జమ్మలమడుగు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన గండికోటలో నూరు అడుగుల శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల మహానాడులో ప్రకటించడంపట్ల బలిజ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిదిలోని ముద్దనూరు రోడ్డులో ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి బలిజ సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి హాజరై క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లడుతూ శ్రీకృష్ణ దేవరాయలవారి పరిపాలన లాగా అన్ని కులాలకు, మతాలకు అతీతంగా పరిపాలన చేస్తున్నారని సీఎం చంద్రబాబు పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు కిరణ్, హరి, దువ్వూరు మురళి, ఐఎల్ చిన్న, మహిళలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు గురుకుమార్, మిర్యాల శివగణపతి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్ విధానంలో బదిలీలు చేపట్టాలి


ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయులకు మ్యానువల్ విధానంలో ప్రభుత్వం బదిలీలు చేపట్టాలని శనివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలను మాన్యువల్ విదానంలో చేపడుతామని హామీ ఇచ్చి నేడు వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టడం తగదన్నారు. వెబ్‌కౌన్సెలింగ్ విదానంలో ఒక్కో ఉపాధ్యాయుడు వేలకొద్ది పాఠశాలలను ఎంపిక చేసుకోవడం కష్టసాధ్యమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎస్‌జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ చేపట్టడానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే సోమవారం డీఈవో కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు శ్రీనివాసరెడ్డి, సుబ్రమణ్యం, సలీం, సుబ్బయ్య, లక్ష్మినారాయణరెడ్డి, జాన్, సురేష్, ఓబుళరెడ్డి, బాలయ్య, అల్లాబకాస్, మోహన్‌రెడ్డి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.


పోరుమామిళ్లలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సభ్యులు

పోరుమామిళ్లలో: ఎస్‌జీటీలకు వెబ్ కౌన్సెల్ ద్వారా కాకుండా మాన్యువల్ విధానంలో బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐక్యఉపాధ్యాయ సంఘం నాయకులు రామక్రిష్ణారెడ్డి, చెన్నయ్య యాదవ్, వారణాసి రవి, భూపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ వెబ్‌కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయులకు ఎక్కువ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందులో నష్టపోయే అవకాశం కూడా ఉందన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందుకు ప్రభుత్వం స్పందించకుంటే డీఈవో కార్యాలయం ముట్టడి చేపట్టడం జరుగుతుందన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

బద్వేలు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జేష్యమాసం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించ్చారు. తదుపరి ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 15న లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి పెంచలకోన లక్ష్మీనరసింహ ఆలయం వరకు మహా పాదయాత్ర ప్రారంభమవుతుందని పాదయాత్రలో పాల్గొనదలచిన భక్తులు 15వతేదీ 4.30గంటలకు ఆలయం వద్దకు చేరుకోవాలన్నారు. భక్తుల వెసులుబాటు బట్టి వారి గ్రామాల నుంచి కూడా పాదయాత్రలో పాల్గొనవచ్చని వసతి, మూడుపూటలా అన్నప్రసాదం, తిరిగి గృహాలకు చేరుకునేంత వరకు వాహన సౌకర్యం తదితర ఏర్పాట్లు చేశామని తెలిపారు. కాగా భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కైంకర్య మడకలవారిపల్లెకు చెందిన పాటూరి వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు నిర్వహించారు

టీడీపీ నాయకుడి కుటుంబానికి సంతాపం

పోరుమామిళ్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గురప్పగారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తిరుమలశెట్టి సుబ్బారావు కుటుంబానికి బ ద్వేలు టీడీపీ యువనేత రితీష్‌రెడ్డి సంతాపం తెలిపారుజ సుబ్బారావు సోదరుడు సుధాకర్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రితీష్‌రెడ్డి గురప్పగారిపల్లెకు వచ్చి సుధాకర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కూటమినేత బొజ్జ రోశన్న, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రంతు, రామక్రిష్ణరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, టీడీపీ నాయకుడు జనార్ధన్ తదితరులు నివాళులర్పించారు.

డీసీసీబీ చైర్మన్‌కు టీడీపీ నాయకుల అభినందనలు


డీసీసీబ్యాంకు చైర్మన్‌కు అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

బద్వేలుటౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కడప డీసీసీ బ్యాంకు చైర్మన్‌గా శనివారం ప్రమాణ స్వీకారం చేసిన సూర్యనారాయణరెడ్డిని బద్వేలు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని వారు కోరారు. డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డికి బద్వేలు వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కనుమర్లపూటి ప్రసాద్, రాగిమాను ప్రతాప్‌కుమార్, మస్తాన్‌బాబు, లకిడి విజయ్, సర్పంచ్ శ్రీనివాసులు, శివయ్యస్వామి, రాధాక్రిష్ణయ్య, వెంకటసుబ్బయ్య, నాగభూషణం, జహంగీర్‌బాషా, ఎ.వెంకటసుబ్బయ్య, ముస్తాఫా, మాచుపల్లె క్రిష్ణారెడ్డి, మాచుపల్లె లక్ష్మీదేవి అభినందనలు తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌కు పరామర్శ

పోరుమామిళ్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ పెసల నరసింహులును ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పరామర్శించారు. పెసలనరసింహులు ఇటీ వల గుండెకు సంబంధించి శస్త్రచికిత్స చేయించుకుని పోరుమామిళ్లలో విశ్రాంతి తీసు కుంటున్నారు, విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శనివారం ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నరు. జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి నరసింహులు, రవిచంద్రరెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా పోలీస్ సబ్ సెంటర్



మైదుకూరు రూరల్ ,జూన్ 7(ఆంధ్రజ్యోతి) :మైదుకూరు మండలంలో గతంలో పోలీస్‌సబ్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగింది. కాలక్రమేన సిబ్బంది కొరతతో అవి తీసివేయడంతో ఉన్న భవనం నిరుపయోగంగా మారింది. నియోజకవర్గంలో ఎక్కువ జనాభా కలిగిన పంచాయతీలలో జీవి సత్రం, వనిపెంట ఉన్నాయి.ఈ పంచాయతీలు రవాణా సౌకర్యాలు కలిగి ఉండడమే కాకుండా వ్యవసాయ పరంగా ఇక్కడ వ్యాపారాలు కూడా ఎక్కువే. అందువలన ఇక్కడ అల్లర్లు, దొంగతనాలు,పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా వనిపెంట, జీవి సత్రంలో పోలీస్‌సబ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే నేరాలు తగ్గుతాయని ప్రజలు అభిప్రాయం పడుతున్నారు. అధికారులు స్పందించి పోలీస్‌సబ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గజమాలతో ఘన స్వాగతం


అట్లూరు వద్ద గజమాలతో స్వాగతం పలుకుతున్నటీడీపీ నాయకులు

అట్లూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డికి, బద్వేలు నియోజక వర్గం సమన్వయకర్త రితీష్‌రెడ్డికి అట్లూరు మండల టీడీపీ నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. కడపలో డీసీసీబీ చైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి ప్రమాణ స్వీకారం ముగించుకుని అట్లూరు మండలానికి చేరుకోవడంతో అట్లూరు క్రాస్ రోడ్డు వద్దగల రెడ్డిపల్లె, కొండూరు, ఎస్వీపురంలలో జనసందోహంతో కలిసిటీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అట్లూరు మండల టీడీపీ సీనియర్ నాయకులు బోవిళ్ల నందగోపాల్‌రెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి, తెలుగు పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు సుధారాణి, మండల ఇన్‌చార్జ్ రెడ్డయ్య, ఎంపీపీ పొత్తపి రమాదేవి, కొండూరు ఎంపీటీసీ లక్ష్మి, ముతుకూరు టీడీపీ నాయకురాలు సులోచన, మండల మాజీ అధ్యక్షులు అమర్‌నాధరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, యువ నాయకులు పాలకొండు రాజశేఖర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, పాటూరు రాధాక్రిష్ణారెడ్డి, చిలిపి క్రిష్ణారెడ్డి, పెద్దరామసుబ్బారెడ్డి, చిన్న రామసుబ్బారెడ్డి, జయక్రిష్ణారెడ్డి, బత్తల వెంకటసుబ్బయ్య, రాజా, రాజగోపాల్‌రెడ్డి, ఎల్.నారాయణరెడ్డి, జేసీబీ సుబ్బారెడ్డి, క్రిష్ణారెడ్డి, కుడుమాల చిన్నపరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అయ్యవారయ్య, గురు ప్రసాద్, అల్లం వెంకటసుబ్బయ్యలతో పాటు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.